# ప్రారబ్ధం భోగతో నశ్యేత్!

వర్షం బాగ కురుస్తున్నది. చలిగాలి రివ్వున వీస్తున్నది. కాటుకలాంటి చీకటి విశ్వంలో గూడుకట్టుకొంది. వాచీచూసుకున్నాడు మధు. ఎనిమిదిన్నరకావస్తున్నది. తన పరిస్థితి తలచుకుంటేతనకే భయంవేసింది. అబ్బ! ఇప్పుడుబస్సుదిగి రెండు మైళ్లు నడవాల! అనుకున్నాడుభారంగా. గుండెలుబరువెక్కాయి తనకుతెలియనిమార్గం ఎలాఉంటుందో? చీకటికి తోడు వర్షం ఒకటి. జంక్షనులో బస్సు దిగగానే ఎడం చేతి వయిపు పాలెం వెళ్ళే రోడ్డు ఉంటుందని, రెండు మైళ్ళు నడవాలనీ మాత్రమే తెలుసుకున్నాడు. అంతే. సాయంత్రానికి చేరిపోవచ్చును కదా అని బయలుదేరాడు. కాని తను బయలుదేరిన వేళావిశేషం ఏమిటోగాని బస్సు దారిలో చెడిపోయింది ఆఖరికి చేతిలో టార్చి అయినా లేనందుకు తనను తానే నిందించుకున్నాడు.

బస్సు చాలా వేగంగా పోతున్నది. చలిగాలి తీవ్రత అంతకంతకు హెచ్చవుతున్నది. సంచీలోంచి మప్లరుతీసి చెవులకు చుట్టబెట్టాడు. కండక్టరు ఒక మూలగా కూర్చుని

వెనక్కు చేరబడి సన్నగా నిద్రతీస్తున్నాడు. "ఏమండోయ్ ! కండక్టరుగారూ! కొంచెం పాలెం జంక్షనుదాటిపోకుండా ఆపించండి." అన్నాడు మధు చిన్న స్థాయిలో. కాని ఇది ఇంజను మోతలోను, గాలివాన హోరులోను లీనమయిపోయింది. మరొకసారి చెప్పాడు. కండక్టరు కళ్లు తెరిచి "అలాగే"అన్నట్లు గట్టిగా సంజ్ఞాసూచకంగా తలవూపి మళ్లీ నిద్రలో మునిగి పోయాడు. బస్సులో చాలామంది నిద్రావస్థలోనే ఉన్నారు. ఒక విధవావిడ ఏవో మంత్రాలు తగ్గు. స్వరంలో ఉచ్చరిస్తున్నది. యిద్దరు కాలేజీ విద్యార్థులు కాబోలు వాళ్లు కాలేజీ గొడవలు చర్చించుకుంటున్నారు. జేబులోంచి సిగరెట్టు తీసి ముట్టించాడు మధు.

పాలెం స్కూల్లో తనకు క్రొత్త మేష్టారుగిరీ. ఊరు ఎలాంటిదో, దాని పరిస్థితులు ఎలాటివో తనకు తెలియదు. కనీసం ఇంతకుముందు ఆ ఊరు పేరయినా తను విని ఉండలేదు. పల్లెటూళ్ళోస్కూలు మేష్టారుగా పనిచెయ్యడమంతటి నరకం ఉండదనిపిస్తుంది ఒక్కొక్క సమయంలో. పరిస్థితులు అనుకూలమయితే ఫరవాలేదుగాని ఎదురు తిరిగితే అక్కడి జీవనం చాలా కష్టమవుతుంది. ప్రస్తుత కాలంలోపల్లెటూళ్లు అనగానే జ్ఞాపకం వచ్చేవి పార్టిలు, విభేదాలు, మునసబుగారి పార్టి, కరణంగారి పార్టి, లేకపోతే ప్రెసిడెంటుగారి పార్టి, ఇంకా ఇలాగ అనేకాలు. వీటిమధ్య జీవితం కత్తిమీద సాము వంటిదే. తగిన గౌరవం, మంచి సంపాదించుకొని జాగ్రత్తగా

వ్యవహారిస్తే ఫరవాలేదు. లేకపోతే కష్టమే. బ్రతకలేక బడి పంతులనే సామెత నూరుపాళ్ళూ సత్యమనిపిస్తుంది. నాలుగేళ్ళుగా ఈ బ్రతికలేని జీవితానికి అలవాటుపడినా మళ్ళీ స్థానం మారగానే అంతా క్రొత్తే.

వర్షం బాగా తగ్గింది. చిన్న తుంపరలు మాత్రం - లుతున్నాయి. చలిగాలి తగ్గలేదు. బస్సు మెల్లగా రొదచేస్తూ ఆగిపోయింది. కండక్టరు తేరుకొని ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా డ్రైవరువైపు చూశాడు.

"ఏరు బాగా వచ్చినట్లుంది. దిగి లోతుచూడకుండా వెళ్ళటం మంచిదికాదు." అంటూ బస్సు దిగాడు డ్రైవరు.

హెడ్‌లయిట్ కాంతిలో ఏరు స్పష్టంగా కనిపిస్తున్నది. నురుగులు కక్కుతూ ఉద్ధృతంగా ప్రవహిస్తున్నది.

"కొత్తనీరు వస్తున్నట్లుంది. దాటడం కష్టమే!" డ్రైవరు అన్నాడు.

జేబులోంచి సిగరెట్టుతీసి ముట్టించాడు మధు "మళ్ళీ ఇదొకగోలా!" అనుకుంటూ.

"ఏమిటో! బయలుదేరినప్పుడే అనుకున్నా: శకునం మంచిదికాదు." నిద్రలోనే మూలుగుతున్నాడు ఒక ఛాందసుడు.

"ఈ వేళ భోజనం ఉండదేమో!" నీరసంగా ఉన్న ఒక భోజనాసక్తుని బాధ.

మరో యిద్దరు వ్యక్తులతోపాటు కండక్టరు ఏటిలోకి దిగాడు. మధ్యవరకూ ఒకరికి వూతగా ఒకరు వెళ్ళి తిరిగి వచ్చారు.

"ఫరవాలేదు. మెల్లిగా వెళ్ళిపోదాం. లేకపోతే కొత్త నీరు వస్తోంది. ఇక ఏరు తగ్గేది ఉండదు. మనుష్యులుదిగిపోతే బస్సువెళ్ళిపోతుంది. మధ్యలో బురదగా వుంది. కొంచెం జాగ్రత్త!" అంటూ ఏకబిగిని చెప్పాడు కండక్టరు.

"బాబూ! మగాళ్ళంతా దిగి నడవాలి. అవతలి ఒడ్డున ఎక్కవచ్చు."

"ఏదో రోటిలో తలదూర్చాక" అనే సామ్యం చెప్పినట్లు అనుకుంటూ పంట్లాం మడతబెట్టి ప్రయాణీకులందరితో పాటు మధుకూడా అవతలి ఒడ్డుకు చేరుకున్నాడు.

బస్సుకూడా అతి ప్రయాసమీద ఒడ్డు చేరింది. ప్రయాణీకుల నెక్కించుకొని నడక ప్రారంభించింది. సుమారు పది నిమిషాలలో పాలెం జంక్షను చేరుకొంది.

మధు బస్సుదిగిపోయాడు బిక్కుబిక్కుమంటూ. తనను ఒంటరిగాడ్ని చేసి రోదచేసుకుంటూ సాగిపోయిన బస్సుకేసి చూస్తూ దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు. చుట్టూ కలయ చూశాడు. అంతా చీకటి. కప్పలు బెకబెకమంటూ అరుస్తున్నాయి. జంక్షనులో దీపాలయినా లేవు. చినుకులు సన్నగా పడుతున్నాయి.

"అగ్గిపెట్టె ఉంటే యిస్తారా?"

వెనుదిరిగి చూచాడు. పక్కనున్న చెట్టుక్రింద నుంచి ఎవరో వ్యక్తి దగ్గరగా వచ్చాడు. మౌనంగా జేబులోంచి అగ్గి పెట్టె తీసి ఇచ్చాడు. పుల్లగీసి చుట్ట వెలిగించుకున్నాడు ఆ ఆగంతకుడు. ఆ వెలుగులో వ్యక్తిముఖాన్ని స్పష్టంగా చూడ గలిగాడు మధు. పీక్కుపోయిన మొగం, లోతైన ఎర్రగా ఉన్న కళ్ళు, మాసిపోయినగడ్డం. ఎందుకో చూడగానే భయం వేసింది.

తను ఒంటరిగాడు. అతడు చూస్తే మంచి బలవంతుని లాగే ఉన్నాడు. తన్ని సంచీతీసుకుంటే తన గతేంకాను ! చుట్టుపక్కల అంతా నిర్మానుష్యంగా ఉంది. ఏమైనా కొంచెం తమాయించుకొని మనస్సుకు ధైర్యం చెప్పాడు. అగ్గిపెట్టె తిరిగి యిచ్చేశాడు ఆ వ్యక్తి.

"ఏమండీ, ఎంతవరకూ వెళ్తారు?" మెల్లగా నడుస్తూ ప్రశ్నించాడు మధు.

"ఏమో, తెలియదు!" ఆగంతకుని జవాబు.

కొంచెం అదరిపడ్డమాట వాస్తవమే కొంపతీసి పిచ్చి వాడా! లేక త్రాగిఉన్నాడా! అర్థంకాలేదు మధుకు. మనస్సు కూడా తన సందేహాన్ని తీర్చలేదు.

"మీది ఏవూరు?" ప్రశ్న మార్చాడు.

"నాకు తెలియదు." మళ్ళీ అదేరకం సమాధానం.

మధు గుండెలు పీచుపీచుమంటున్నాయి. ఆగంతకుని మనస్తత్వం అర్థంకాలేదు. అతన్ని మంచిచేసుకోవడంకంటె

మార్గాంతరం తోచలేదు. కొంచెం తెలివిగా వ్యవహరించాలి అనుకున్నాడు.

"మీ పేరు?" ధైర్యంచేసి మరో ప్రశ్న చేశాడు.

"పేరులేదు." తాపీగా నడుస్తూ సమాధానం చెప్పాడు ఆ వ్యక్తి.

"మీకు పేరు కూడా లేదా!" మధు తన ఆశ్చర్యాన్ని మరింత ఎక్కువపాళ్ళలో పైకి వ్యక్తంచేశాడు.

ఆగంతకుడు మాట్లాడలేదు.

"పోనీ, పాలెం వెళ్లేదారి యిదేనా?" అనుమానంగా ప్రశ్నించాడు మధు.

"ఆ! యిదే!"

తనకు పనికివచ్చే సమాధానం దొరికింది. కొంచెం నడక వేగం హెచ్చించాడు మధు; మీదపడే తుంపర్లను రుమాలుతో ఒత్తుకుంటూ.

"పోనీ, మీరు ఇప్పుడు నాతో వస్తారా?"

"వస్తాను." ముక్తసరిగా అన్నాడు అగంతకుడు.

పాపం ఎవరో మతిస్థిరం లేనివాడై ఉంటాడు. అతడు సమాధానం చెప్పే ధ్వనిచూస్తే తనకు అపకారం చేసేటట్లు కనబడడంలేదు. ఏదయినా తీరని వ్యథతో కుమిలిపోతున్నాడేమో? అనిపించింది. ఆగంతకునిమీద భయం కొంత తగ్గి జాలిగా మారింది.

"పాపం! మీ మాటలు వింటోంటే ఎలాగో అని

పిస్తోంది. మీ గొంతులో ఏదో విషాదం, బాధ ధ్వనిస్తున్నాయి. బాధలు ఏమైన వుంటే ఇంకొకరితో చెప్పుకుంటే కొంత శాంతి లభిస్తుంది. లోపల దాచుకున్న కొద్దీ క్రుంగి కృశించడం తప్ప నాతో చెప్పకూడదూ?"

ఈ పర్యాయం మధు కొంతవరకూ కృతకృత్యుడయ్యాడు... ఆగంతకుడు బాగా దారిలో పడ్డాడు.

"నాతో పూర్వ పరిచయం లేకపోయినా, నేను తెలియకపోయినా, కనీసం నా పేరు కూడా నేను చెప్పకపోయినా, నామీద జాలిచూపిస్తున్నందుకు చాలా కృతజ్ఞుణ్ణి. క్షమించండి! నా పేరు రామారావు!" అతని కంఠంలో కృతజ్ఞత స్పష్టంగా తొంగిచూసింది.

అనవసరంగా మీ బాధల్ని జ్ఞప్తికి తెచ్చి మిమ్మల్ను కష్టపెడుతున్నానేమో!"

జీవంలేని వాడినవ్వు నవ్వాడతను. "ఇందులో కష్టపెట్టినదేమీ లేదు! నా జీవితం అంతమయ్యేవరకూ నా బాధలు నన్ను విడిచిపెట్టవు. నాకు ఇప్పుడు ఎవ్వరూ లేరు! బంధుమిత్రులంతా నన్ను ఏనాడో ఏడేళ్ళక్రితం వెలివేశారు. నాకు ఏవరైనా ప్రస్తుతం ఉంటే అది మీరే. కనుక చెప్తాను. నాకు ఇప్పటివరకూ తీరని కోరిక ఒకటి ఉండిపోయింది. అది తీర్చుకోవాలి. అందుకే ఈ వ్యధ" బరువుగా చెప్పడం ఆపాడు రామారావు.

ఈ మాటలతో మధు గుండెలమీదనుంచి పెద్దబరువు

పించినట్లయింది. భయం పూర్తిగా తొలగిపోయింది. మనస్సులోనే దేవుడికి నమస్కరించాడు.

“ఏమిటో మీ కోరిక?” కుతూహలంగా ప్రశ్నించాడు.

“నాకు ఈ పాడులోకం మీద పూర్తిగా విరక్తి కలిగింది. న్యాయానికీ, ధర్మానికి తావులేని ఈ నీచలోకంనుంచి ఎంత త్వరగా నిష్క్రమిద్దామా? అని ఉంది. నాకు చావాలని ఉంది. కాని...” ఆగాడు.

మధులో మరొకసారి ఆశ్చర్యం మొలకెత్తింది.

“మీరు అంతా విచిత్రంగా మాట్లాడుతున్నారు. మిమ్మలను అర్థంచేసుకోవడం చాలా కష్టంగా ఉంది. చావాలని కోరుకోవడం ధైర్యవంతుల లక్షణం కాదు. మానవుడు బతకడం కోసం పుడుతున్నాడు. చావడానికి ప్రయత్నించే వాళ్ళను లోకం పిరికి వాళ్ళలోనూ, అసమర్థులలోనూ జమకడుతుంది. మీ కోరిక సమంజసంగాలేదు.”

“లోకం నన్ను గురించి ఏమనుకుంటే ఏం మునిగింది? ఏ పాపం ఎరుగని నన్ను హంతకునిగా ఈ లోకం జమకట్టలేదూ? అంతా చాలించుకో బోయేనన్ను పిరికివానిగానే అనుకోనివ్వండి! అయితే, నేను చావడానికి ఇంకా వ్యవధి ఉంది. నా అన్వేషణ పూర్తికావాలి. ఆ రామనాథం నా చేతిలో చిక్కాలి. అతణ్ణి చీల్చి చిత్రవధ చేసి పగతీర్చుకోవాలి.

ఆ తరువాతే నా చావు. రామనాథం చచ్చిన మరుక్షణం నుంచీ నాకీ లోకంతో పనిలేదు!" రామారావు మాటల్లో ఎవరోకాని ఆ రామనాథం మీదపగ, తన జీవితంమీద నిస్పృహా స్పష్టంగా కనిపించాయి.

"మీరు మాట్లాడేది నాకు అర్థంకావడంలేదు." మెల్లగా అన్నాడు మధు.

"అవును. మీకు అర్థంకాదు! అర్థమయ్యేటట్లు చెప్తాను" అంటూ బరువుగా శ్వాసపీల్చాడు రామారావు.

మధు జేబులోంచి సిగరెట్టుతీసి వెలిగించాడు. రామారావుతో అన్నాడు: "సిగరెట్టు కాలుస్తారా?"

"ఊహుఁ వద్దు." తల విదిల్చాడు.

వర్షం బాగా తగ్గుముఖం పట్టింది. జేబులో సిగరెట్టు పెట్టి ఉంచుతూ అన్నాడు మధు: "చెప్పండి!"

"సుమారు ఏడు సంవత్సరాల క్రితం నేను సంఘంలో పరువుగల వ్యక్తిని. నాకు డబ్బు, హోదావుండేవి. బంధువులు ఉండేవారు. మిత్రులు ఉండేవారు. నా జీవితం హాయిగా ఉండేది. మొదటినుంచీ నాది ఒంటరి మన స్తత్వం. నాకు ఒకరి గొడవ అక్కరలేక పోయేది. సాధ్యమైనంత న్యాయంగా బ్రతకడానికే ప్రయత్నించేవాణ్ని. కాని పాడులోకం నన్ను

అలా ఉండనివ్వలేదు. న్యాయంగానూ, మంచిగానూ బ్రతికే నామీద చెడ్డను రుద్దింది. ఏ పాపమూ ఎరుగని నన్ను హంతకుడిగా జమకట్టింది. నాకు అసలు ఏ హత్యతోనూ సంబంధం లేదు. కాని నన్నుకూడా న్యాయస్థానానికి యీడ్చింది. నన్ను దోషిగా నిర్ణయించి ఏడేళ్ళ కఠినశిక్ష విధింపచేసింది. అందుకే నాకు లోకమన్నా, ఈ పాడు సంఘమన్నా అసహ్యాం! నాకు ఏ పాపమూ తెలియదని న్యాయస్థానంలో మొత్తుకున్నాను. కాని అవతలి పార్టీవారు ఏవో విధానాలు ప్రయోగించి జడ్జిని తమవైపు తిప్పుకున్నారు. ఫలితం నాకు ఏడేళ్ళ కఠిన శిక్ష. అంతకన్న బరువైనది ఒక అపనింద. నేను హత్యచేశానని, నేను జైలుకు వెడుతున్నానని తెలియగానే నా బంధువులు, మిత్రులు-ఎవ్వరూ దగ్గరకు వచ్చి సానుభూతి చూపిన పాపానకూడా పోలేదు. నన్ను ఇంత అధోగతికిదించిన జడ్జి రామనాథం మీద నానాటికి నకు కక్ష పెరిగింది. ఆపగ సాధిధామనే ఈ ఏడేళ్లూ బ్రతికి ఉన్నను. లేకపోతే ఏనాడో ఆత్మహత్య చేసుకుని ఈ పాడులోకంనుంచి నిష్క్రమించేవాణ్ణి. నాలో ప్రతి రక్తబిందువూ ప్రతీకారవాంఛను పురికొల్పుతూంది. అతడు బ్రతికుంటే ఇంకా నాలాంటి అమాయకులు ఎంతమంది అతని కలానికి బలికావాలో! మొదట రామనాథం చావాలి. తరువాత నాకు ఈ లోకంతో పనిలేదు" ఆవేశంతో చెప్పుకుపోతున్నాడు రామారావు.

మధుకు ఏం మాట్లాడాలో తోచలేదు. అతడుచూస్తే తప్పకుండా అజడ్జీని యమపురికి పంపేటట్లున్నాడు. తన జీవితాన్నికూడా బలిచేసుకునేటట్లున్నాడు. కర్తవ్యం తోచలేదు. అయినా రామారావులోని ఆవేశం చల్లార్చడానికి ప్రయత్నించాడు.

"చూడండి, రామారావుగారూ! మీ స్థితిచూస్తూంటే నాకు చాలా జాలికలుగుతున్నది. మీ ప్రతీకార వాంఛ కూడా బాగానేవుంది. కాని మంచి మార్గంలో రామనాథం గురించి ఆలోచించండి. అతనికి మీమీద స్వతహాగాగానీ, మనసాగానీ కక్షఏమీ లేదు. ఒక జడ్జీగా శిక్షవిధించాడు. అంతేగాని రామనాథంగా శిక్షవిధించలేదు. అతని కర్తవ్యం నెరవేర్చుకున్నాడు. అతనికి దొరికిన ఆధారాలు, సాక్ష్యాలు అలా చేశాయి. అతడేదో తప్పుమార్గం తొక్కాడని మీరు అనుకోవడం పొరపాటేమో! మానవునికి క్రోధావేశాలు శత్రువులు. అవి మానవత్వం నశింపజేసి పశుత్వాన్ని రేపుతాయి. మనిషిని పశువుగా మారుస్తాయి. వాటికి లొంగిపోవడం మంచిది కాదు. మీ భావిజీవితాన్ని సుఖవంతం చేసుకోవడానికి ప్రయత్నించండి. గత జీవితానికి తెర వెయ్యండి. అదంతా పీడకలగా భ్రమించి మరిచిపోండి. అనవసరంగా ఒక నిండు ప్రాణాన్ని తియ్యకండి. మీ ప్రాణాన్ని బలిచేసుకోకండి!" గంభీరంగా అన్నాడు మధు.

"ఇక ఆపండి! మీరు నాలోని పగను చల్లార్చేస్తున్నారు. నాకు ఏదో చెబుతున్నారు-వద్దు. ఇలాగే ఉండనివ్వండి. నాకు మానవత్వంమీద ఆశ లేదు. నాలోని మానవత్వం ఏనాడో నశించిపోయింది. నన్ను పశువుగానే పగతీర్చుకోనివ్వండి. మీ సలహాకు కృతజ్ఞుణ్ణి" రామారావు అడ్డుపడ్డాడు.

అతను మాట్లాడే ప్రతిపదంలోనూ రామనాథం మీద కసివెల్లడి అవుతున్నది. అతనికి పుట్టిన పగను ఈ ఏడేళ్లూ జైల్లో కూర్చుని పెంచుకున్నాడు. ఒక్కసారి ఎలా చల్లారిపోతుంది! అనుకున్నాడు మనస్సులో. ఏదో ఒక నివారణోపాయం ఆలోచించాలి. మెదడుకు మెరుపులా ఒక ఆలోచన తట్టింది. దాన్ని వెంటనే అమలులో పెట్టాడు.

"ఇంతకీ ఆ రామనాథం ఇంటిపేరు?" ప్రశ్నించాడు.

"ఎందుకు మీకు?" తిరుగుప్రశ్న వచ్చింది రామారావునుంచి.

"నాకు చిన్న అనుమానం వచ్చింది!"

ఫలానా అని ఇంటిపేరు చెప్పాడు. ఎగిరి గంతేశాడు మధు.

"మైగాడ్! చంపారు! నేను అనుకున్నట్లే అయింది మొదటినుంచీ నాకు అనుమానంగానే ఉంది! మీరు ఎంత దురదృష్టవంతులు!"

"ఏం! ఏమైంది! అలా అంటున్నారు?"

"మీ బద్ధశత్రువు రామనాథం రెండేళ్లు టి. బి. తో కుళ్ళికుళ్ళి మొన్ననే నెల్లాళ్ళక్రితం చచ్చాడు. మీ కోరికను దేవుడే నెరవేర్చాడు."

రామారావు ఆనందానికి హద్దులు లేకపోయాయి. మధును కౌగలించుకున్నంత పనిచేశాడు. "ఎంత మంచివార్త చెప్పారు! కత్తితో పొడిస్తే ఒక్కసారే చస్తాడని విచారిస్తున్నా. టి.బి తో కుళ్ళి చచ్చాడా?" ఆనందం ఆపులేకుండా ఏదో చెప్పుకుపోతున్నాడు.

వర్షం మళ్ళా కొంచెంకొంచెం హెచ్చవుతున్నది. ఎదురుగా మలుపులో కారులైట్లు కన్పించాయి. ఆ వెలుగులో రామారావు మొగంలోని సంతోషాన్ని స్పష్టంగా చూడగలిగాడు. కారుదగ్గరపడింది. రామారావు చెయ్యిపుచ్చుకొని పక్కకు వెళ్ళాడు మధు. కాని అతడు చెయ్యి విదిలించుకొని స్పీడుగా వస్తున్న కారుకడ్డంగా పరుగెత్తాడు. వారించి వెనక్కు లాగబోయాడు మధు. కాని ఫలితం లేకపోయింది. అంతవరకూ తన ప్రక్క మాట్లాడుతూ నడిచిన రామారావును కారు గుద్దెయ్యటంతో దూరంగా వెళ్ళిపడ్డాడు.

కారు కిర్రున శబ్దంచేస్తూ ఆగిపోయింది. మధుకు ఒళ్ళంతా చెమటలు పోశాయి. కాలూ చెయ్యీ ఆడలేదు. కారు తలుపులు తెరుచుకొని ఇద్దరు వ్యక్తులు క్రిందకు దిగారు.

"ఆ దొంగ వెధవెవడో పారిపోతున్నాడు. పట్టుకోండి!" కారులోంచి కేకవినబడింది.

ఆ ఇద్దరు వ్యక్తులూ మధును పట్టుకొని కారు ఎక్కించారు. రామారావునుకూడా డ్రైవరు సాయంతో కారు లోనికి చేర్చారు. కాని అతని ప్రాణం కొన్ని క్షణాల్లోనే అనంత వాయువుల్లో లీనమయింది. రామారావును రక్షించడానికి ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. తన తెలివి ఉపయోగించి రామనాథాన్ని రక్షించడంలో కృతకృత్యుడయ్యాడు మధు. కాని, ఫలితం?

"ఒక వ్యక్తిని రామనాథంగారి కారు క్రిందకుతోసి హత్యచేసినందుకు మధుకు ఏడేళ్ళశిక్ష విధించబడింది."

ఇక మధుకుకూడా ఒక కోరిక మిగిలిపోయింది. రామారావు లాగే!